మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల/నారాయణపేట

# జిల్లాలో ఎన్నికల సిబ్బంది మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి...

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**



మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపడుతున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 26 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాకు సంబంధించి పార్లమెంట్ ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ సిబ్బందికి సంబంధించి మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎన్ఐసీ వీడియో సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బందికి సంబంఇంచి మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేటతో పాటు జడ్చర్ల నియోజకవర్గ పరిధిలోని ఊర్కొండ మండలం, శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 909 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 20 శాతం అదనంగా 4552 మందిని మొదటి విడత ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. అందులో 1138 పీఓలు, 1138 ఏపీఓలు, 2276 ఓపీఓలు ఉన్నారన్నారు. ప్రతి బృందంలో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు అదనపు పోలీస్ అధికారులు ఉంటారన్నారు. రిజర్వ్ బృందాలకు శిక్షణ ఇచ్చి, హోమ్ ఓటింగ్‌కు ఉపయోగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు కుమార్ దీపక్, కే.సీతారామారావు, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, ఈడియం నరేష్, ఎన్ఐసీ సిబ్బంది అర్జున్, శివ, మధు తదితరులు ఉన్నారు.

# నేను ఫోన్ ట్యాపింగ్ బాధితునే..!

**ప్రశ్నించే గొంతునే నొక్కిండ్రు**

**గత 5 సంవత్సరాలుగా**

**నా ఫోన్ ట్యాప్ చేస్తున్నారు**

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి**

**ఫోన్ ట్యాపింగ్‌పై డిజిపికి ఎమ్మెల్యే ఫిర్యాదు**



డిజిపికి ఫిర్యాదు చేసిన కాపీని మీడియాకు చూయిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 26 ప్రభాతవార్త :** రాజకీయ వేత్తలను, వ్యాపార వేత్తలను ఫోన్ ట్యాపింగ్‌తో బెదిరింపులకు గురి చేశారని, తాను ఫోన్ ట్యాపింగ్ బాధితుడినేనని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతూ వ్యక్తి ప్రైవేట్ జీవితంలోకి తొంగిచూసి, వారి స్వార్థానికి ఉపయోగించుకోవడం తొంగిచూసి, వారి స్వార్థానికి ఉపయోగించుకోవడం దుర్మార్గమైన చర్యగా హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయంలో ఫోన్ ట్యాపింగ్‌పై ఫిర్యాదు చేసి, అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు హరించే విధంగా ఆర్టికల్ 14,19,21లను ఉల్లంఘనకు గురిచేస్తూ, నాటి మంత్రి రాజకీయ ప్రత్యర్థుల మీద, వ్యాపారస్తుల మీద, పౌరహక్కుల నేతల మీద, పత్రికా విలేఖరులను ఫోన్ ట్యాపింగ్ అనే బ్రహ్మోస్త్రం ఉపయోగించి వారి జీవితాలతో చెలగాటం ఆడారని ఆయన ఆరోపించారు. గత ఐదు సంవత్సరాలుగా తన ఫోన్, తన బంధువులు, స్నేహితుల ఫోన్లను, రాజకీయ నాయకుల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేశారని ఆయన మండిపడ్డారు. రాజకీయ నాయకులు పోలీసుల అపవిత్రమైన కలయికతోనే ప్రజలు స్వేచ్ఛకు విఘాతం కలిగించే విధంగా రీడింగ్ రూం, బెడ్రూంలోకి తొంగిచూసే విధంగా నాటి మంత్రికి ఫోన్ ట్యాపింగ్ రికార్డు పోలీసులు అందించారని రాష్ట్ర డిజిపికి, సిట్ శ్రీనివాస్‌రెడ్డి కమిషనర్ ఆఫ్ పోలీస్ హైదరాబాద్‌కు పూర్తి ఆధారాలు అందించానని ఆయన చెప్పారు. డిజిపి, సిట్ శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో జరుగుతున్న విచారణను పూర్తి స్థాయిలో జరిపించాలని, ఎవరి ఒత్తిడి మేరకు, ఎవరి ఆదేశానుసారం అనధికార ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారో తెలియజేయాలని, ఫోన్ ట్యాపింగ్‌కు చరమగీతం పాడాలని, దోషులు ఎవరైనా ఏ స్థాయిలోని వారైనా కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్‌పి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప ఎన్నికకు ఏర్పాట్లు చేయాలి..

**రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జి. రవినాయక్ ఆదేశం**

**మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం పరిశీలన**



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 26 ప్రభాతవార్త :** ఈనెల 28న జరగనున్న మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నిక పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం (ఎంపిడిఓ)లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రం వద్ద 100 మీ.ల పరిధి మార్క్‌చేసి బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, పోలింగ్ కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్‌తో పాటు స్థానిక సంస్థల అదనపు శివేంద్రప్రతాప్, జడ్పీ సీఈఓ రాఘవేంద్రరావు, ఆర్డీఓ నవీన్ పాల్గొన్నారు.


# పార్లమెంట్ ఎన్నికల సిబ్బంది మొదటి దశ రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి...



అధికారులతో సమావేశమైన కలెక్టర్ సంతోష్

**గద్వాల ప్రతినిధి మార్చి26 ప్రభాతవార్త :** త్వరలో జరగబోవు సాధారణ లోకసభ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ విధులు నిర్వహించే పిఓ,ఎపిఓ,ఓపిఓల కేటాయింపునకు మొదటి దశ రాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించినట్లు జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ బి.ఎం సంతోష్ నిర్వహించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్సు హాలు నందు ఎన్నిక ల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గాలకు సిబ్బంది కేటాయింపునకు ఆన్‌లైన్ ద్వారా మొదటి దశ ర్యాండమైజేషన్ పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెండు నియోజకవర్గాలు గద్వాల,అలంపూర్ నియోజకవర్గాలకు పోలింగ్ సిబ్బందిని మొదటి దశ ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించినట్లు తెలిపారు.ప్రక్రియ పూర్తి చేసిన వివరాలను స్క్రీన్ ద్వారా చూపించారు.మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ తదుపరి ఎన్నికల

# భానుడి భగభగలు..!



ఉమ్మడి జిల్లాలో ఎండల తీవ్రత పెరిగింది. మార్చి ప్రారంభం నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూయిస్తున్నాడు..ఏప్రిల్,మే నెలలో పెరగాల్సిన ఎండ తీవత్ర ఈసారి మార్చి ఆరంభం నుంచే మొదలైంది. ఉమ్మడి జిల్లాలోని మూడు జిల్లాలు ఆరంజ్‌జోన్‌లోకి వెళ్లగా మరో రెండు జిల్లాలు యెల్లో జోన్‌లో ఉన్నాయి. ఊష్ణోగ్రతలు 40డిగ్రీలు దాటడంతో వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రానున్న మూడు రోజులు మరింత ఊష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. గడిచిన మూడు రోజులుగా అత్యధిక ఊష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలు దంచికొడుతుండడంతో జనాలు బయటకు రావడానికి జంకుతున్నారు. ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలుపడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఉదయం 9గంటలు దాటిందంటేనే ఎండ వేడిమికి రోడ్లన్నీ నిర్మానుషంగా మారుతున్నాయి. ఇక మధ్యాహ్నం వేళలో బయటకు వెళ్లాలంటేనే జనాలు భయాందోళన చెందుతున్నారు.

- 40డిగ్రీలు దాటిన ఊష్ణోగ్రతలు
- ఆరంజ్ జోన్‌లోకి మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్
- మూడు రోజులు మరింత పెరిగే అవకాశం
- మధ్యాహ్నం ఖాళీగా దర్శనమిస్తున్న రహదారులు
- వడగాల్పులతో ప్రమాదం అంటున్న నిపుణులు

**నమోదైన గరిష్ఠ ఊష్ణోగ్రతలు**

| జిల్లా | ఊష్ణోగ్రతలు |
|---|---|
| నాగర్‌కర్నూల్ | 40.4 |
| మహబూబ్‌నగర్ | 40.6 |
| గద్వాల | 40.0 |
| వనపర్తి | 40.3 |
| నారాయణపేట | 38.7 |

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 25, ప్రభాతవార్త :** ఉమ్మడి మబూబ్‌నగర్ జిల్లాలో రికార్డు స్థాయిలో ఎండల తీవ్రత పెరిగింది. ఈ ఏడాది ఊష్ణోగ్రత మార్చిలోనే గరిష్ఠానికి చేరుకుంటున్నది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి సగటున 3నుంచి4 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతున్నది. వడగాల్పులు వీచే అవకాశం ఉందని ప్రజలు అవరమైతేనే బయటకు రావాలని సంబంధిత శాఖ అధికారులు సూచిస్తున్నారు. వడదెబ్బ తగిలే అవకాశం ఎక్కువగా ఉందని ఇండ్లలోనే ఉండాలని హెచ్చరిస్తున్నది. గత ఏడాది జూలై నుంచి ఎల్‌నినో ప్రభావం కొనసాగుతున్నది. వర్షాలు తక్కువగా కురియడం, సాధారణం కంటే తక్కు వర్షపాతం నమోదు కావడం ఎండ తీవ్రత పెరిగేందుకు కారణాలుగా చెప్పవచ్చు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని ఐదు జిల్లాలో ఇప్పటికే ఎల్లో జోన్‌లో ఉండగా ఆరంజ్ జోన్‌కు చేరువలో ఉన్నాయి. అయితే రానున్న రెండు మూడు రోజుల్లో మరో 2నుంచి 3డిగ్రీల ఊష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతున్నది. చిన్న పిల్లలు, వృద్ధులను అవసరమైతే తప్పా అనవసరంగా ఉండలకు బయటకు పంపొద్దని అధికారులు, వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఒక వేళ బయటకు వెళ్లిన నీళ్ల బాటిల్ వెంట తీసుకెళ్లాలని, తరుచూ నీళ్లు తాగాలని చెబుతున్నారు. ఇంట్లో ఓఆర్ఎస్ ప్యాకట్లు ఉంచుకోవడం మంచిదని, పండ్ల రసాలు ఇంట్లోనే తయారు చేసుకోవడం ఆరోగ్యానికి మేలు అని సూచించారు.

జ్యూస్ సెంటర్లకు పెరిగిన గిరాకీ

శీతల పానీయాలు తాగేందుకు జ్యూస్ సెంటర్లు, చల్లదనం కోసం జనాలు పార్కులను ఆశ్రయిస్తున్నారు. వీటితోపాటు ఐస్ క్రీం పార్లర్లు, చెరుకు రసం, మజ్జిక, నిమ్మరసం దుకాణాలకు గిరాకీ పెరిగింది. పేదోడి ఫ్రిడ్జ్‌కు గిరాకీ పెరిగింది. చల్లనీ నీళ్లు తాగి ఎండలనుంచి కొంతైనా ఉపశమనం పొందుదామని తాగునీటి కుండలను కొనుగోలు చేస్తున్నారు. దీంతోపాటు ఎండల తీవ్రతకు జనాలు సేదతీరేందుకు వివిధ మార్గాలను వెతుక్కుంటున్నారు. వివిధ రకాల పండ్ల జ్యూస్ ధరలను కూడా వ్యాపారులు పెంచారు. రూ.30 నుంచి రూ.120 దాకా ఒక్కో గ్లాస్ జ్యూస్ విక్రయిస్తున్నారు. ముఖ్యంగా దాదాపు రాష్ట్రమంతా ఇదే పరిస్థితి నెలకొనే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దారిపొడవునా రహదారుల వెంట నిమ్మరసం బండ్లు, చెరుకురసం బండ్లు వెలిశాయి. దీంతో జనాలు కొంతైనా ఉపశమనం పొందాలని శీతలపానీయాలు సేవిస్తున్నారు.

# ఒక్క అవకాశం ఇవ్వండి..!

- అభివృద్ధి చేసి చూపిస్తా
- దేవరకొండ గద్వాల రైల్వే లైన్ సాధిస్తాం..
- మళ్లీ కేంద్రంలో వచ్చేది మోడీ ప్రభుత్వమే..
- బిజెపి పార్లమెంట్ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్
- 30ఏండ్లలో ఏ ఒక్కరికి చేయి చాచలే : ఎంపీ రాములు
- వనపర్తిలో బీజేపీ పార్లమెంటరీ సమావేశం
- వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు



అసెంబ్లీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న పోతుగంటి భరత్

**వనపర్తి టౌన్, మార్చి 26, ప్రభాతవార్త :** కేంద్రంలో మళ్లీ మోడీ ప్రభుత్వం ఏర్పాటే లక్ష్యంగా బిజెపి సాధించే 400సీట్లలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఉండేలా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాల్సిన అవసరం ఉందని బిజెపి పార్లమెంట్ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ అన్నారు. బీజేపీ వనపర్తి అసెంబ్లీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన లక్ష్మీ కృష్ణ గార్డెన్స్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పార్లమెంట్ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ మాట్లాడుతూ బిజెపి గెలిస్తే దేవరకొండ - గద్వాల రైల్వే లైను సాధిస్తానని, వనపర్తి పట్టణం మీదుగా జాతీయ రహదారి మరియు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు యువతకు ఉపాధి లక్ష్యంగా మోడీ ఆశీస్సులతో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్లమెంటు సభ్యులు పి రాములు మాట్లాడుతూ గత 30ఏళ్లుగా శాసన సభ్యునిగా మంత్రిగా, పార్లమెంటు సభ్యునిగా ఎక్కడ కూడా ఒక రూపాయి కొరకు చేయి చాచలేదని అవినీతికి ఆస్కారం లేని ప్రజాసేవ లక్ష్యంగా పనిచేశానని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలో దేశ సేవ చేయడానికి పోతుగంటి భరత్ ప్రసాద్ మీ ముందుకు వస్తున్నారని పెద్ద మనసుతో అందరూ దీవించి పార్లమెంటు సభ్యునిగా అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు.

జాతీయ ఓబిసి కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి మాట్లాడుతూ 6 గ్యారంటీల మాటున 420 అబద్దపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒక హామీ నెరవేర్చలేదని కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంటు కష్టాలు వస్తాయని, అవినీతి రాజ్యమేలుతుందని, నిన్న హైదరాబాదులో హోలీ పండుగ సందర్భంగా హోలీ ఆడుతున్న బంజారా కమ్యూనిటీకి చెందిన ప్రజలను ఒక వర్గం వారు అకారణంగా దాడి చేయడం కాంగ్రెస్ సంస్కృతిని గుర్తు చేస్తుందని హైదరాబాద్ నియోజకవర్గంలో బిజెపి పార్లమెంట్ అభ్యర్థి మాధవి లత గెలుస్తున్నారని అక్కసుతో కాంగ్రెస్ అండతో మజ్లీస్ గుండాలు దాడిని బిజెపి తీవ్రంగా ఖండిస్తుందని ఈ దాడికి ప్రతిఫలం రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఘోర పరాజయం తప్పదని ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి వైపు అడుగులు వేయాలని అశాంతికి కారణమైన వారిని వారిపై చర్య తీసుకోకపోతే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు డి నారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ ఆర్ లోకనాథ్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ జక్క రఘునందన్ రెడ్డి, రాష్ట్ర గిరిజన మోర్చా నాయకులు మంగ్యా నాయక్, గద్వాల జిల్లా అధ్యక్షులు పి రామచంద్రారెడ్డి, నాగరకర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులురవీందర్, మెంటపల్లి పురుషోత్తంరెడ్డి, బి శ్రీశైలం, జ్యోతి, రమణ, అక్కల రామన్‌గౌడ్, కే మాధవరెడ్డి, కుమారస్వామి, సీతారాములు, వెంకటేశ్వర్ రెడ్డి, సుమిత్రమ్మ, హేమారెడ్డి, బాశెట్టి శ్రీనివాసులు, విష్ణువర్ధన్ రెడ్డి, చిత్తారి ప్రభాకర్, దాసరాజు ప్రవీణ్, బచ్చు రాము, పెద్దిరాజు చెన్నయ్య, మనివర్ధన్, గొర్ల బాబురావు, బోయల రాము, బుచ్చిబాబు గౌడ్, రాజశేఖర్ గౌడ్,అశ్విని రాధ,కల్పన, కదిరే మధు, కొమ్ము సామేలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు,కార్యకర్తలు

# వేసవి కాలం దృష్ట్యా తాగునీటి సరఫరా లేకుండా చూడాలి..

**- ఏప్రిల్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలి...**

**- వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లతో సీఎస్ శాంతకుమారి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 26 ప్రభాతవార్త:** గ్రామాల్లో, పట్టణాల్లో తాగునీటి సరఫరా, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, సీఎంఆర్ లక్ష్యాలపై హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరి పంట కొనుగోలు నిమిత్తం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించాలని ఆమె సూచించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి అదనపు కలెక్టర్లు, స్థానిక సంస్థలు కుమార్ దీపక్, కే.సీతారామారావు సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు. యాసంగి ధాన్యం కొనుగోలు, సీఎంఆర్ డెలివరీ, తాగునీటి ఎద్దడి తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సీఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ యాసంగి పంట కోతలకు వస్తున్న నేపథ్యంలో జిల్లా స్థాయిలో వరి కోతల ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, యాసంగి పంట కొనుగోలుకు రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉంటుందని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌళిక వసతులు కల్పించాలని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరా, టెంట్లు వంటి ఏర్పాటు చేయాలని సీఎస్ అన్నారు. చివరి గింజ వరకు నాణ్యమైన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరపై కొనుగోలు చేస్తుందని, రైతులు ఎక్కడ తక్కువ విక్రయించుకోవాల్సిన అవసరం లేదనే ఉద్దేశ్యంతో రైతుల వద్దకు వెళ్లేలా అవగాహన కల్పించాలని భారత ఆహార సంస్థ నిర్ధేశించిన ధాన్యం నాణ్యత ప్రమాణాలు, తేమ శాతంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకొని నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొని వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా కార్యచరణ చేపట్టాలని, సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో తాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సరి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా కార్యచరణ రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వేసవిలో నీటి సమస్య రాకుండా నివారించుటకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామ స్థాయిలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి అత్యవసరమైన మరమ్మత్తులు ఏమైనా ఉన్నాయా అని పరిశీలించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 10 తేదీ లోపు ధాన్యం కొనుగోలు కేంద్రాలను అన్ని మౌచక సదుపాయాలతో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ధాన్యం బరువు కొలిచే యంత్రాలు, గోనే సంచులు, టార్పలిన్లు, రైతులకు చలువ నీడ ఏర్పాట్లు, తాగునీరు, తేమ కొలిచే యంత్రాలు వంటి అన్ని మౌళిక సదుపాయాలు ఉండే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో తాగునీటి అవసరాల మేరకు బోరు బోవులను, పాత తాగునీటి సరఫరా మోటార్లను పునరద్ధరించాలని, తాగునీటి సరఫరా నిమిత్తం అవసరమైన పనులను వెంటనే చేపట్టాలని, ఎక్కడ నిధులకు ఆటంకం లేనందున అత్యంత ప్రాధాన్యతతో తాగునీటి సరఫరా పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ కే.సీతారామారావు, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై అధికారి స్వామికుమార్, మార్కెట్ అధికారి బాలమణి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఇతర జిల్లా అధికారులు

# పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలి..

**85 సంవత్సరాల వయస్సు పూర్తి అయిన దివ్యాంగులకు హోమ్ ఓటింగు కల్పించే విధంగా సదుపాయాలు ఏర్పాటు చేయాలి**

**జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవర్**

**వనపర్తి టౌన్ మార్చి 26 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా వ్యాప్తంగా జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో అత్యధికంగా ఓటర్లు పాల్గొనే విధంగా సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఉన్నత అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. 85 సంవత్సరాల వయస్సు పూర్తి అయిన ఓటర్లు, దివ్యాంగులకు హోమ్ ఓటింగు తో పాటు పోలింగ్ సిబ్బంది, అత్యావసరం సేవల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఇచ్చే ప్రక్రియ పకడ్బందీగా జరిగేందుకు మంగళవారం ఉదయం జిల్లా ఎన్నికల అధికారి కలెక్టరేట్ కాన్ఫరెన్సు హాల్లో పోస్టల్ బ్యాలెట్, మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ హోమ్ ఓటింగ్ ఎవరికి ఇవ్వాలి. పోస్టల్ బ్యాలెట్ ఎవరికి వస్తుంది. అనేది అధికారులకు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. 85 సంవత్సరాల వయస్సు పూర్తి అయిన వారు, దివ్యాంగులకు అందుకు సంబంధిత ఓటర్లకు ఫారం 12 డి ఇవ్వాలని తెలిపారు. వచ్చిన దరఖాస్తులకు అనుగుణంగా ఎన్నికల రోజు కంటే ముందే గుర్తించిన హోమ్ ఓటర్ల ఇంటికి వెళ్లి ఓటింగు వేయించాల్సి ఉంటుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఎన్నికల రోజున విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బంది, ఈ ప్రక్రియలో పాల్గొనే డ్రైవర్లు, కండక్టర్లు, పోలిసు సిబ్బంది, మీడియా ప్రతినిధులు, సర్వీస్ ఓటర్లకు ఫారం 12 అందించి దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్లో ఓటింగు వేసే విధంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. వయస్సు పై బడిన ఆరోగ్యం సహకరించక, దివ్యాంగులు పోలింగు స్టేషన్ వరకు నడవలేక, లేదా ఎన్నికల విధులు నిర్వహిస్తూ పోలింగ్ స్టేషన్ వెళ్లి ఓటు వేయాలేని పరిస్థితిలో ఒక్క ఓటరు మిగిలిపోవద్దని సూచించారు. దీని కొరకు పకడ్బందీగా ఓటర్లను గుర్తించడం వారికి ఫారం 12 లేదా 12 డి అందించి జిల్లాలో అత్యధికంగా ఓటింగు శాతం పెంచాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ యం.నాగేశ్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి సురేశ్, తాహసిల్దార్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



## పెద్దపల్లిలో గ్రామ బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లోకి చేరిక..



**మల్దకల్ మార్చి 26 ప్రభాతవార్త :** మల్దకల్ మండలం పెద్దపల్లి గ్రామ బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. రాజశేఖర్ రెడ్డి, అశోక్, ఎస్ఎస్ రాజు, యు. శివ, నరసింహ, బోయ నరసింహ, సవారీ నడిపాన్న అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిరుపతయ్య చేతులమీదుగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్న పెద్దపల్లి యువ నాయకులు బలిజ ఓం శంకర్, బలిజ చంద్రన్న, బలిజ శివయ్య, బలిజ సురేష్, నాగశివుడు, బలిజ వీరేష్, నరేందర్, వినోద్, వేణు, గువ్వల రాముడు, తెలుగు రాజు, బోయ సవారీ, బోయ అంజి, బోయ గోకరి, తెలుగు దాస్తగిరి, బోయ జమ్మన్న, తెలుగు రాఘవేంద్ర తదితరులు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు.

## ఎన్నికల తనిఖీల్లో భాగంగా పట్టుబడ్డ నగదు..



**బాలానగర్, మార్చి 26 ప్రభాతవార్త :** మండల కేంద్రం సమీపంలో పోలీసుల ఆధ్వర్యంలో తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మంగళవారం తనిఖీలు నిర్వహిస్తుండగా నగదు పట్టుబడిందని ఎస్సై తిరుపాజీ తెలిపారు. మాల రామ్మూర్తి తండ్రి తిమ్మప్ప, కరిగానిపల్లి గ్రామము, అనంతపూర్ జిల్లావాసి దగ్గర రూ.100000 కురువ కిష్టప్ప తండ్రి అంజనప్ప, కందుర్పి గ్రామం అనంతపూర్ జిల్లావాసి దగ్గర రూ. 64 వేలు, ఎండి సలీమ్ తండ్రి మొయినుద్దిన్, బావాజీపల్లి గ్రామం, తిమ్మాజిపేట మండలం నాగర్‌కర్నూల్ జిల్లా వాసి దగ్గర రూ. 54 వేల నగదు లభించినట్లు ఎస్సై తిరుపాజీ తెలిపారు. ఈ నగదును జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని గ్రివియన్స్ కమిటికి అప్పగిస్తామని తెలిపారు. ఈ నగదుకు సంబంధించిన వారు సరైన ధృవపత్రాలు చూపించి నగదు తెచ్చుకోవాల్సిందిగా కోరారు. ఈ తనిఖీలలో ఎస్సై తిరుపాజీతో పాటు కానిస్టేబుల్ వెంకటరెడ్డి, అక్బర్, గణేష్, గోపాల్, గౌస్‌భాషా, హోంగార్డు బాలరాజు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్..



**అలంపూర్ మార్చి 26 ప్రభాతవార్త :** రానున్న ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల నేపథ్యంలో జోగులాంబా గద్వాల అలంపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఈ పార్టీకి చెందిన పలువురు ఎంపిటీసీలు, మాజీ సర్పంచులు మున్సిపల్ వార్డు కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు హైదరాబాద్ లోని సంపత్ కుమార్ నివాసంలో వారికి ఏఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అలంపూర్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో ఐజ పదవ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ మేకల అనిత భర్త మేకల నాగిరెడ్డి టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రంగు శ్రీధర్ ఉప్పల తిమ్మారెడ్డి, మాజీ సర్పంచులు భాస్కర్ గౌడ్, లక్ష్మన్న ఏక్లాస్ పూర్ ఆంజనేయులు, భీమన్న ఆయా గ్రామాల నుండి భారీ సంఖ్యలో దాదాపు రెండు వందల మంది బీఆర్ఎస్ ముఖ్య నాయకులు ఉన్నారు. వీరి వెంట నాయకులు మాస్టర్ షేక్షావలి ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పరిపల్లిలో చురుకుగా సాగుతున్న సిసి రోడ్డు పనులు..

**ఉప్పునుంతల, మార్చి 26 ప్రభాతవార్త :** మండలంలోని ఉప్పరిపల్లి నుంచి మామిళ్ళపల్లి మార్గానికి ఇటీవల అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ రోడ్డు పనులకు పూజ చేశారు. దాదాపు మూడు కోట్ల వ్యయంతో చేపడుతున్న పనుల్లో నాణ్యత లోపించకుండా పంచాయతీరాజ్ అధికారుల పర్యవేక్షణలో పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. దీంతో మామిళ్ళపలిల గ్రామానికి వెళ్లడానికి మర్రిపల్లి, ఉప్పునుంతల అదేవిధంగా బల్మూరు మండలం గట్టు తుమ్మెద, మహాదేవ్‌పూర్ గ్రామాల ప్రజలకు దూరం తగ్గుతుంది. ఉప్పరిపల్లి గ్రామానికి దాదాపు కిలోమీటర్ వరకు సిసి రోడ్డు, 30 మీటర్ల బ్రిడ్జి పనులు చేపడుతున్నట్లు మాజీసర్పంచ్ అనంత ఇంద్రసేనారెడ్డి వివరించారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన ఆశలు నేటితో నెరవేరనున్నాయి.



ఉప్పరిపల్లిలో సాగుతున్న సిసి రోడ్డు పనులు

## ప్రతి ఓటరు ఓటుహక్కు వినియోగించుకోవాలి..

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్**

**స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన చైతన్య ర్యాలీ నిర్వహణ**

**ఉత్సాహంగా పాల్గొన్న ఉద్యోగులు, యువత, విద్యార్థులు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 26 ప్రభాతవార్త :** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ పట్టణంలో స్వీప్ ఆధ్వర్యంలో (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ఓటరు అవగాహన చైతన్య ర్యాలీ నిర్వహించారు. డిఎస్ఎ స్టేడియం వద్ద స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. పట్టణంలో డీఎస్ఏ స్టేడియం నుండి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్, తెలంగాణ చౌరస్తా మీదుగా ప్రధాన వీధుల్లో ప్రజలను చైతన్యపరుస్తూ ముగిసింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని, ప్రతి ఓటరు ఎన్నికలలో పాల్గొని ఓటుహక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ర్యాలీలో భాగంగా అందరికి వినిపించేలా పలు నినాదాలిచ్చారు. ఓటుహక్కు ప్రజల హక్కు, నిర్భయంగా ఓటేద్దాం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం, ఓటేసే బాధ్యత మనందరి బాధ్యత, ఓటరు చైతన్యం, ప్రజాస్వామ్య ప్రభంజనం, ఓట్ ఫర్ డెమొక్రసీ వంటి నినాదాలతో హోరెత్తించారు.




ర్యాలీ ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్




ర్యాలీ నిర్వహిస్తున్న సంస్థ సభ్యులు, అధికారులు, యువత, విద్యార్థులు

## మన్యంకొండలో ఘనంగా అలివేలు మంగతాయారు రథోత్సవం..

**- గరుడవాహనంపై తేరు మైదానానికి వచ్చిన స్వామిసమేత అమ్మవారు**

**- వేలాదిగా తరలివచ్చిన భక్తులు**

**- నేడు వసంతోత్సవం, పూర్ణాహుతి**

**దేవరకద్ర, మార్చి26 ప్రభాతవార్త:** జిల్లాలో పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ అలివేలుమంగతాయారు అమ్మవారి విమాన రథోత్సవం మంగళవారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి తిరుకళ్యాణమహోత్సవం జరిగిన రోజే రథోత్సవాన్ని నిర్వహించడం ఆయవాయితీగా వస్తుంది. ఈ పవిత్రఘట్టానికి జిల్లా నుండేగాక వివిధ రాష్ట్రాలనుండి భక్తులు మన్యంకొండకు అధికసంఖ్యలో తరలివచ్చారు. దీంతో అమ్మవారి దేవస్థానం భక్తజనసందోహంతో పులకించిపోయింది. అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 23న అంగరంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. అందులోని ప్రధానఘట్టమైన రథోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా వెంకటేశ్వరస్వామి సమేత అమ్మవారిని దేవస్థానంలో ప్రత్యేక పూజల అనంతరం శోభాయమానంగా అలంకరించిన గరుఢ వాహనంపై పెద్దఊరేగింపుతో కాడగాల వెలుతురు, మిరుమిట్లు గొలిపే టపాసుల మద్య భ్యాండు, సన్నాయివాయిద్యాలు, భక్తుల హరి నామచ్ఛరణల మద్య తేరుమైదానానికి తీసుకవచ్చారు. అనంతరం సాంప్రదాయరీతిలో కుంభం పోసిన తరువాత వివిధ రకాలపూలు, రంగురంగు విధ్యుత్‌బల్బులతో సర్వాంగసుందరాంగా అలంకరించిన రథంపై ఉంచి రథోత్సవాన్ని ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన భక్తులు అమ్మవారి రథాన్ని లాగడానికి పోటీపడ్డారు. దీంతో దేవస్థానం పరిసరాలు జనసంద్రాన్ని తలపించాయి. ఈ కార్యక్రమాన్ని కన్నుల పండువలా నిర్వహించారు.

**అలంకరణలో భక్తకోటికి స్వామిసమేత అమ్మవారి దర్శనం..** రథోత్సవం సందర్భంగా సర్ణాభరణ అలంరణలో వెంకటేశ్వరస్వామి సమేత అలివేలుమంగతాయారు అమ్మవారు రథంపై ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారిని వివిధ బంగారు ఆభరణాలు, గులాబిపూలమాలల మద్య మెరసిపోయారు. ఈ నయనానందకర సుందర దృశ్యాన్ని చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకించి పోయారు. ఈ సందర్భంగా భక్తులు చేసిన దైవనామస్మరణతో రథోత్సవం ప్రాంతం మారుమొగింది. దేవస్థానం ముందున్న దేవగుండు వరకు ఈ రథోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం స్వామిసమేత అమ్మవారిని మళ్ళి గరుధవాహనంపై గర్భగుడిలోకి తీసుకెళ్ళి అక్కడ వివిద పూజలతో పాటు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అలివేలు మంగతాయారు రథోత్సవం సందర్భంగా దేవస్థానానికి భక్తులు మన్యంకొండకు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈశ్వశ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్, నరసింహ్మాయ్య, పాలకమండలి సభ్యులు, వివిధగ్రామాలకు చెంది ప్రజాప్రతి నిధులు, నాయకులు, పర్యవేక్షకుడు నిత్యానందచారి తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారి దేవస్థానాన్ని రంగు రంగుల విధ్యుత్‌బల్బులతో అలంకరించారు.

**నేడు వసంతోత్సవం, పూర్ణాహుతి..** మన్యంకొండ శ్రీ అలివేలుమంగ తాయారు అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుదవారం అశ్వవాహనసేవ పూజా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామిసమేత అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలతో పాటు వసంతోత్సవం, పూర్ణాహుతి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు.



అమ్మవారిని గరుడవాహనంపై తేరుమైదానానికి తీసుకవస్తున్న పురోహితులు, భక్తులు



అలివేలుమంగతాయారు రథోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



రథం పై కొలువుదీరిన అమ్మవారు



కోలాటం వేస్తున్న భక్తులు

## పాత నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి..

**రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి**

**నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి,**

**వనపర్తి టౌన్ మార్చి 26 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా ఎస్పీ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాలు నందు ఎస్పీ రక్షత కె మూర్తి జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల సంఘం సూచనల ప్రకారం బాధ్యతగా విధులు నిర్వర్తించాలని తెలియజేశారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సమస్యాత్మక వ్యక్తుల, రౌడీషీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా వారిలో భరోసా కల్పించే విధంగా పనిచేయాలని తెలిపారు. గంజాయి అక్రమ రావాణా, క్రికెట్ బెట్టింగులు, జూదం, మట్కా అలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్రమ మధ్యము, నగదు రవాణాలను నిరోధించడంలో భాగంగా చెక్ పోస్టలలో విధులు నిర్వర్తించే సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. సరైన ఆధారాలు లేకుండా ఎవరైనా పరిమితికి మించి నగదును రవాణా చేస్తూ పట్టుబడితే ఎన్నికల నియమావళి ప్రకారం కేసులు నమోదు చేయాలని తెలిపారు. ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్తులకు శిక్ష పడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చారించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని, సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిషేదిత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలైన యువత తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్ ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దొంగతనం కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయి, భాధితులు వెంటనే స్పందించే ఫిర్యాదు చేసినప్పుడు సైబర్ నేరగాళ్ళ ఖాతాలలో ఉన్న నగదును ఫుట్ ఆన్ హోల్డ్‌లో ఉంచడమైనదని అన్నారు. అట్టి నగదును కోర్టు ద్వారా కొన్ని మార్గనిర్దేశాలతో భాదితులకు అందజేయడం జరిగుతుందని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి (బ్లాక్ స్పాట్స్), వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకురేలా పనిచేయాలని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను పాటించకుండా మద్యం సేవించి వాహనాలను నడుపుతూ, క్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ శ్రీ రామదాసు తేజావత్, డిఎస్పీ జె వేంకటేశ్వరరావు, డిసిఆర్‌బి డిఎస్పీ, కృష్ణ కిశోర్, జిల్లాలోని వనపర్తి, కొత్తకోట, ఆత్మకూర్ సిఐలు, జిల్లా ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా స్థాయి పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా ఎస్పీ రక్షిత కే మూర్తి

## రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ షూటింగ్‌లో మక్తల్ విద్యార్థులు..

**మక్తల్, మార్చి 26 ప్రభాతవార్త :** ఈ నెల 17న మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి బాల బాలికల సబ్ జూనియర్ షూటింగ్ బాల్ క్రీడా ఎంపికలో నారాయణపేట జిల్లా నుండి మక్తల్ శాంతినికేతన్ పాఠశాల బాల బాలికలు బి. మధుప్రియ, బి. మహేశ్వరి, బి. వెంకటేష్ పాల్గొని అసమాన క్రీడా నైపుణ్యతను ప్రదర్శించి జాతీయస్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికైనట్లు షూటింగ్ బాల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. గోపాలం ద్వారా సమాచారం అందినట్లు శాంతినికేతన్ పాఠశాల ప్రిన్సిపల్ డి.వి. చారి, పిఈటీ సి. అమ్రేష్ బుధవారం విలేఖరుల సమావేశంలో తెలిపారు. వారు మాట్లాడుతూ మా శాంతినికేతన్ పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైనందులకు సంతోషాన్ని, ఆనందాన్ని వ్యక్తపరిచే మా విద్యార్థులు ఈనెల 28 నుండి31 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఘజియాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి క్రీడలలో తెలంగాణ జట్టు తరపున ఆడతారని, డివి చారి తెలిపారు. జాతీయస్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికైన బాల బాలికలను రాష్ట్ర అధ్యక్షుడు ఎం. శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు బి.గోపాలం, ప్రధాన కార్యదర్శి సి.హెచ్ ఐలయ్య అభినందించారు. జాతీయస్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికైన బి. మధుప్రియ, బి. మహేశ్వరి, బి. వెంకటేష్ ఈనెల 26న ఉత్తరప్రదేశ్‌కు తరలివెళ్లినట్లు పిఈటి సి. అమ్రేష్ తెలిపారు. జాతీయస్థాయి షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికైన బాల, బాలికలను, అందుకు కృషి చేసిన పీఈటి, సి అమ్రేష్‌ను పాఠశాల ప్రిన్సిపల్ డివిచారి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందించారు.



షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికైన విద్యార్థులు

## మేల చెరువు వాసి సుధారాణికి డాక్టరేట్..

**ఇటిక్యాల, మార్చి 26 ప్రభాతవార్త :** జన్యుశాస్త్రంలో చేసిన పరిశోధనలకు గాను సుధారాణికి ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు ఈనెల 21వ తేదీన డాక్టరేట్ ప్రకటించిందని ఆమె భర్త డా. ప్రేమ్‌కుమార్ తెలిపారు. గద్వాల మండలము మేల్వచెరువు గ్రామంలో భాగ్యమ్మ, ఏసేపుల రెండో కుమార్తె కె.సుధారాణి, ఉస్మానియా యూనివర్సిటీలోని జన్యుశాస్త్ర విభాగంలో క్యారెక్టరైజేషన్ ఆఫ్ ఫైటో ఎక్స్ట్రాక్ట్ ఫర్ యాంటి ఏపీలెప్టిక్ యాక్టివిటీ ఆఫ్ అకాలిఫా ఇండియా అనే అంశంపై పరిశోధనలు జరిపి ఔషధ మొక్కల ప్రాముఖ్యత, మూర్చ వ్యాధిని తగ్గించుటలో వాటి ప్రాధాన్యతలపై పరిశోధనలు చేసి, వాటిని మూర్చవ్యాధి వచ్చిన ఎలుకలపై ప్రయోగించి జన్యుపరమైన మార్పులు గమనించినట్లు సుధారాణి తన పరిశోధన గ్రంథంలో సమర్పించినట్లు, అందుకుగాను, ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించిందన్నారు. ఈ సందర్భంగా సుధారాణికి డాక్టరేట్ రావడం వల్ల పరిశోధన విద్యార్థులు తల్లిదండ్రులు, బంధువులు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక సుధారాణికి డాక్టరేట్ వచ్చిన సందర్భంగా అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహం డాక్టరేట్ పొందిన సుధారాణిని అభినందించారు. ఈ సందర్భంగా సుధారాణి తన పరిశోధనలకు సహకరించిన ప్రొఫెసర్ రోజారాణికి పరిశోధక విద్యార్థులకు తన చదువులో ప్రోత్సహించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.



డాక్టరేట్ పొందిన సుధారాణిని అభినందిస్తున్న అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహాం

## జయప్రకాష్ కు ఉత్తమ అవార్డు అందజేత..

**అలంపూర్ మార్చి 26 ప్రభాతవార్త :** రాజోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న టిబి నోడల్ పర్సన్ జయప్రకాష్ కు ఉత్తమ అవార్డు దక్కింది. ఈ మేరకు గద్వాల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శశికళ, డిప్యూటి డిఎమ్ హెచ్ ఓ టిబి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సిద్దప్ప జయప్రకాష్ కు అవార్డును అందజేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్య శాఖలో జరిగిన క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో జయప్రకాష్ కు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. జయప్రకాష్ కు ఉత్తమ అవార్డు రావడం పట్ల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుబాబు, రామకృష్ణ, హెలెన్, రంజిత్ కుమార్, ఏఎన్ఎమ్‌లు ఆశా కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.




అవార్డును అందజేస్తున్న వైద్య అధికారులు

## రూ.5725 ధర పలికిన ఆముదాలు..


**దేవరకద్ర, మార్చి 26 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయమార్కెట్ యార్డుకు మంగళవారం రైతులు 9 కింటాళ్ళ ఆముదాలను విక్రయానికి తీసుకవచ్చారు. వీటికి అత్యధికంగా కింటాల్‌కు రూ.5725 ధర పలికింది. అతి తక్కువగా కూడ అంతే ధర పలికింది. అలాగే 76 కింటాళ్ళ సోన ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. వీటికి అత్యధికంగా కింటాల్ సోన ధాన్యానికి రూ.2331 ధర పలికింది. అలాగే అతి తక్కువగా 2229 ధర పలికింది. 6 కింటాళ్ళ హంస ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. వీటికి అత్యధికంగా కింటాల్ ధాన్యానికి రూ. 1998 ధర పలికింది. అలాగే అతి తక్కువగా కూడ అంతే ధర పలికింది. 22 కింటాళ్ళ శ్రీరాంగోల్డ్ ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. వీటికి అత్యధికంగా కింటాల్ ధాన్యానికి రూ. 2331 ధర పలికింది. అతితక్కువగా కూడ అంతే ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## పేదలకు సేవ చేయడమే సేవా బృందం లక్ష్యం...

**- పాత బట్టలను మాకివ్వండి... మేము పేదలకు పంచుతాం**

**- స్వామి వివేకానంద సేవా బృందం అధ్యక్షులు శివకుమార్**

**కల్వకుర్తిటౌన్, మార్చి 26 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామి వివే కానంద సేవా బృందం ఆధ్వర్యంలో పాత బట్టల సేకరణ కార్యక్రమం కొనసాగు తోంది. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శార్వని తన ఇంట్లో ఉన్న 10 బ్యాగుల చిన్న పిల్లలను బట్టలను సేవా బృందం సభ్యులకు కళాశాల ఆవరణలో అందించారు. ఈ సందర్భంగా పట్టణంలో నివసిస్తున్న పేద ప్రజలకు సేవా బృందం సభ్యులు పంచి పెట్టారు. పాత బట్టలను పడేయకుండా మాకు అందిస్తే వాటిని అవసరమైన పేదలకు పంచి వారిని సంతోషంగా చేస్తామని సేవా బృందం అధ్యక్షులు శివకుమార్ తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు చింటూ, ఉపాధ్యాయులు మల్లేష , శ్రీను తదితరులు ఉన్నారు.



## పార్లమెంట్ ఎన్నికల సిబ్బంది మొదటి దశ రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి...

మొదటి పేజీ తరువాయి భాగం..

సిబ్బందికి మాస్టర్ ట్రైనర్స్ ద్వారా ఏప్రిల్ 15,16 తేదీలలో పిఓ, ఏపిఓ లకు శిక్షణ తరగతులు నిర్వహించినున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అపుర్వ్ చౌహాన్, ఎన్నికల సూపరింటెండెంట్ నరేష్, సి.పి.ఓ లక్ష్మణ్, ఈ-డియం శివ తదితరులు పాల్గొన్నారు.

## పీయూలో అంతర్జాతీయ వర్క్‌షాప్

### - పాల్గొన్న విద్యావేత్తలు, ప్రొఫెసర్లు





వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రొఫెసర్లు

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 26, ప్రభాతవార్త:** ఆంగ్ల విభాగ అధినతి మాళతి ఆధ్వర్యంలో నిర్వహించిన నాల్గో ప్రపంచ సాహిత్యంపై అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య వక్తలుగా డాక్టర్ రాజూనాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ ఇఫ్లూ, బీవోఎస్, పీయూ ప్రొఫెసర్ గూడురు మనోజ విశ్రాంత ఆచార్యులు జయదీర్ తిరుమలరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగద మనోజ మాట్లాడుతూ నాల్గో ప్రపంచ సాహిత్యపు వైవిధ్యాన్ని, ప్రాముఖ్యతను తెలిపారు. డాక్టర్ రాజునాయక్ మాట్లాడుతూ సాహిత్యంపై విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరుపాలని సూచించారు. ప్రొఫెసర్ డేనియల్ నెజర్స్ మాట్లాడుతూ అంతరించిపోతున్న ఆదివాసీ అస్థిత్వం గురించి వివరించారు. చివరగా ప్రొఫెసర్ జయదీర్ తిరుమలరావు మాట్లాడుతూ గిరిజన ఆదివాసీ జీవన విధానాలను వారి ఉనికిని తెలియపర్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డామధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, సీవోఈ రాజ్‌కుమార్, ఎస్సీ,ఎస్టీ సెల్ డైరెక్టర్ డా,కుమారస్వామినాల్గో ప్రపంప సాహిత్యంపై తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఆంగ్ల విభాగం, పీయూ వివిధ పీజీ సెంటర్ల అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.


## వివాదాస్పదంగా మారిన షార్ట్‌ఫిలిం షూటింగ్



షార్ట్ ఫిలిం షూటింగ్‌కు ఉపయోగించిన ఎస్టీ బాలుర వసతి గృహం

**లింగాల,మార్చి 26 ప్రభాతవార్త:** షార్ట్ ఫిలిమ్ షూటింగ్ సమయంలో ఫొటోలు తీసే సందర్భంగా కొంతమంది వ్యక్తుల మధ్య వివాదాస్పదం చోటు చేసుకున్న సంఘటన సోమవారం రాత్రి మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతి గృహంలో చోటు చేసుకుంది. వసతి గృహంలో షాట్ ఫిలిమ్ షూటింగ్ తీసేందుకు కొంతమంది వసతి గృహంలోకి ప్రవేశించి షూటింగ్ తీయడం మొదలుపెట్టారు.షూటింగ్ చేస్తుండగా అందులో ఒక వ్యక్తి సన్నివేశంతో పాటు ఫొటోలు తీస్తుండగా వసతి గృహానికి చెందిన ఒక ఉద్యోగి అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో మాట మాట పెరిగి ఘర్షణకు దారితీసింది. కొంతమంది వర్కర్‌లను చితకబాదక విడిపించారు. దీంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది. కాగా ఈ సంఘటన పట్ల హాస్టల్ వార్డెన్ తిరుపతయ్యను వివరణ కోరగా వసతి గృహంలో షాట్‌ఫిలిమ్ షూటింగ్ తీస్తామని,అందుకు సంబంధించిన వ్యక్తులు కొన్ని రోజుల నుంచి అడుగుతూ వస్తున్నారని అందుకు అనుమతి ఇవ్వడం జరిగినట్లు తెలిపారు. కాగా ఘర్షణ చోటు చేసుకోవడం, అనుకోని సంఘటన అని, దీనిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయనతెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

## శాస్త్రోక్తంగా నవకలశ స్నపనం





**బిజినేపల్లి,మార్చి26 ప్రభాతవార్త:** వట్టెంశ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శాస్త్రోక్తంగా నవకలశ స్నపనం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థాన స్థానాచార్యులు సముద్రాల శ్రీమన్నారాయణ, ప్రధానార్చకులు ప్రసాద్‌స్వామి ఆధ్వర్యంలో అర్చక బృందం ఆధ్వర్యంలో ప్రాతరారాధన, కుమ్భమణ్డలారాధన,సేవాకాలం, హోమం,బాలభోగ నివేదన, పూర్ణాహుతి, శాత్తుమొఖై, తీర్థప్రసాద గోష్టి, నవకలశ స్నపనం, అలంకారం రాజభోగ నివేదన, శాత్తుమొబై,తీర్థ ప్రసాద గోష్టి, సాయంకాల ఆరాధన, కుంభ మండలారాధన,సేవాకాలం, నివేదన, పూర్ణాహుతి, శాత్తుమణై, తీర్థ ప్రసాద గోష్టి కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం ఉత్సవ పరిసమాప్తిలోభాగంగా ప్రాతరారాధన,చతుస్థానార్చన, సేవాకాలం, హోమం, బాలభోగ నివేదన, మహా పూర్ణాహుతి, శాత్తుమొబై, తీర్థ ప్రసాద గోష్టినవకలశ స్నపనంచక్రతీర్థం, అలంకారం రాజభోగ నివేదన, శాత్తుబొబై, దేవతోద్వాసనం, శ్రీ పుష్పయాగ ద్వాదశారాధన, సప్తవరణం, ధ్వజారోహణం, మూకబలి, శాత్తుమొబై, యాజమాన్య ఆశీర్వచనం, ఆచార్యాది సన్మానములు, ఉత్సవ పరిసమాప్తి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సందడి ప్రతాప్‌రెడ్డి, అనంత నరసింహారెడ్డి, నరేందర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, చంద్రారెడ్డి, జకపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఎదుర్కోలేకే బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్

### ఎలక్ట్రోల్ బాండ్ల పేరుతో పెద్ద స్కాం చేసిన బిజెపి

### టిపిసిసి అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్

**మహబూబ్‌నగర్ బ్యూరో,మార్చి 26 ప్రభాతవార్త:** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోలేకే పార్టీకి సంబంధించిన బ్యాంకు ఖాతాను కుట్రపూరితంగా ఫ్రీజ్ చేశారని టిపిసిసి అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందనే భయంతో పార్టీకి సంబంధించిన 11 బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయడం సరికాదన్నారు.ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆర్థికంగా దెబ్బతీయాలనే లక్ష్యంతోనే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడిందన్నారు. ఎన్ని కుట్రలు చేసినా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాన్ని ఆపలేరని అన్నారు. ఎలక్ట్రోల్ బాండ్ల పేరుతో బిజెపి ప్రభుత్వం పెద్ద స్కాం చేసిందని ఆరోపించారు. దేశంలోని ప్రభుత్వ సొమ్మును లూటీ చేస్తున్నారని విమర్శించారు. ఎలక్ట్రోల్ బాండ్లను తీసుకునేలా పెద్ద కంపెనీలపై ఒత్తిడి చేసిందన్నారు. దేశంలోని 38 పెద్ద కంపెనీలకు 179 కాంట్రాక్టులు ఇవ్వడంలో ఆంతర్యమేమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకపక్క కాంట్రాక్టులు ఇచ్చి మరోపక్క డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పార్టీల ఎలక్ట్రోల్ బాండ్లను బహిర్గతం చేయాలని సుప్రీంకోర్టు ఆదేశిస్తే ఐదు నెలల సమయం కావాలని ఎస్‌బిఐ అంటుందని, బిజెపిని కాపాడడం కోసం ఇంత వ్యవధి కోరుతున్నారా అని ప్రశ్నించారు. సమావేశంలో జిల్లా మీడియా సెల్ కన్వీనర్ సిజె బెనహర్, మండల అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జహీర్ అక్తర్

# ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో నువ్వా...నేనా

**కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే గెలుపుపై ధీమా**

**ఉమ్మడి జిల్లాలో మెజార్టీ సీట్లు బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులవే**

**ఓట్లను కాపాడుకునేందుకు ప్రజా ప్రతినిధులను**

**క్యాంపులకు తరలించిన పార్టీలు**

**క్యాంపులో మాజీ మంత్రి కెటిఆర్ ప్రజాప్రతినిధులతో సమావేశం**

**నేడు, రేపు క్యాంపుల నుండి తిరుగు పయనం**

**28న ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్**



గోవా క్యాంపులో ఉన్న అలంపూర్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

**ఇటిక్యాల,మార్చి 26 ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల నుండి 2021 సంవత్సరంలో కల్వకుర్తికి చెందిన కసిరెడ్డి నారాయణరెడ్డి ఏకగ్రీవంగా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. గత ఏడాది నవంబర్‌లో జరిగిన సాధరణ ఎన్నికల్లో కల్వకుర్తి నుండి ఎమ్మెల్యేగా కసిరెడ్డి నారాయణరెడ్డి గెలుపొందడంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక జరిపించేందుకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయగా ఈ నెల 28న ఎన్నికల జరగనుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో గెలుపు నీదా నాదా అన్న విధంగా అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అటు ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అందుకనుగుణంగానే ప్రజాప్రతినిధులు చేజారకుండా ఉండేందుకు వారం రోజులుగా కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల ప్రజా ప్రతినిధులను అలాగే మహిళల ప్రజా ప్రతినిధుల స్థానంలో భర్తలను క్యాంపులకు గోవా,కర్ణాటక, కొడైకెనాల్ వంటి ప్రాంతాలకు తరలించారు. అయితే క్యాంపుల్లో ఉన్న బిఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను కలుసుకుని వారికి భరోసా కల్పించి పార్టీ బలపరిచిన అభ్యర్థి నవీన్‌కుమార్ రెడ్డికి పార్టీకి చెందిన వారంతా ఓట్లు వేయాలని ఎమ్మెల్సీ బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డితో కలిసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కెటిఆర్, మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి, గద్వాల,అలంపూర్ ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి, విజయుడు, ఆయా నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేల పార్టీ ముఖ్య నాయకులతో కలిసి అభ్యర్థించారు. 28న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ నుండి గెలుపొందిన జడ్పీటిసిలు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు పార్టీ బలపర్చిన అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని మాజీ మంత్రి కెటిఆర్ ప్రజా ప్రతినిధులకు సూచించారు. క్రాస్ ఓటింగ్‌కు పాల్పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పార్టీ నేతలను మాజీమంత్రి కెటిఆర్ ఆదేశించినట్లు సమాచారం. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 1439 ఓట్లు ఉండగా అందులో 900లకు పైగానే బిఆంఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఎన్నిక కాగా 350 మంది ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీకి చెందినవారు ఉండటం, అలాగే బిజెపి పార్టీకి చెందిన 100 మంది దాకా ప్రజాప్రతినిధులు ఉండడంతో ఉప ఎన్నిక పోరు ఉత్కంఠగా మారనుంది. అంతేకాక ఎలాగైనా గెలవాలని అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రం బిఆర్ఎస్ పార్టీ నుండి ఓట్లు రాబట్టుకునేందుకు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలు ఇప్పటికే పార్టీలో చేర్చుకంటుండగా క్యాంపులలో ఉన్న కొందరితో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తుంది. అంతేకాక బిజెపి పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఓటు ఎవరివైపు వెళ్తాయో అంతుపట్టని ప్రశ్నగా ఉందని పోటీలో నిలిచిన అభ్యర్థులకు అంతు చిక్కని ప్రశ్నగా మారింది చెప్పవచ్చు. ఎలాగైనా ఎమ్మెలీన ఉప ఎన్నికల్లో గెలుపొందేందుకు గాను ప్రజా ప్రతినిధులకు రెండు పార్టీల అభ్యర్థులు వారికి అన్ని విధాలా అండగా ఉండి సహకరిస్తామని హామీ ఇచ్చి ప్రజాప్రతినిధులు చేజారకుండా ఉండేందుకు గోవా, కర్ణాటక, కొడైకెనాల్ వంటి ప్రాంతాలకు క్యాంపులకు తరలించారు. అలంపూర్, గద్వాల నియోజకవర్గాలకు చెందిన ప్రజా ప్రతినిధులకు జిల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశపు హాలులో గద్వాల జిల్లాలో మొత్తం 225 మంది ప్రజాప్రతినిధుల ఓట్లు ఉండగా 28న గురువారం నాడు ఉపఎన్నిక జరుగుతుండగా క్యాంపులో ఉన్న ప్రజాప్రతి నిధులు మంగళవారం బయలుదేరుతుండగామరికొందరు బుధవారం బయలుదేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. మరికొంతమంది క్యాంపుల నుండి నేరుగా వెళ్లి ఎన్నికల్లో జడ్పీటిసిలు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు ఓటు వేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలి

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్

**వనపర్తి టౌన్,మార్చి26, ప్రభాతవార్త:** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు,తాగు నీటి కొరకు వేసవి ప్రణాళికపై మంగళవారం మధ్యాహ్నం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ధాన్యం అమ్ముకోవడం రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌలిక సదుపాయాలతో సకాలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.కొనుగోలు కేంద్రాలు ప్రారంభోత్సవరం సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.వేసవిలో తాగు నీటి సమస్య లేకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 10వ తేదీ లోపు రబీ (యాసంగి) ధాన్యం కొనుగోలు కేంద్రాలను అన్ని మౌలిక సదుపాయాలతో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ధాన్యం బరువు కొలిచే యంత్రాలు ,గోనె సంచులు, టార్పాలిన్లు,రైతులకు చలువ నీడ ఏర్పాట్లు,తాగు నీరు, తేమ కొలిచే యంత్రాలు వంటి అన్ని మౌలిక సదుపాయాలు ఉండే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు.ట్రాన్స్ పోర్టు కాంట్రాక్టర్ల జాబితా సమర్పించాలని,ఏ లారీ ఏమిల్లుకు కేటాయిస్తున్నమో ముందే ప్రణాళిక చేసుకోవాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల ఇంచార్జులు ప్రభుత్వఉద్యోగులు అయిఉండాలని సూచించారు. ఎఫ్.సి.ఐ,పౌర సరఫరాలశాఖకు ఇవ్వాల్సిన సి.యం.ఆర్ ధాన్యం వేగవంతంగా ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.తాగు నీటి సరఫరా పై వివరిస్తూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి తాగు నీటి సమస్యలు ఏమున్నాయో ఎప్పటికప్పుడు నివేదికసమర్పించాలని అధికారులను ఆదేశించారు.టెల్‌ఎండ్ వరకుసమానంగా నీరు సరఫరా అయ్యే విధంగాచర్యలు తీసుకోవాలనిసూచించారు. అవసరమైన బోర్‌వెల్,మోటార్ పంప్‌లు మరమ్మతులు చేయించి ఏదైనా సమస్య వల్ల మిషన్ భగీరథ ద్వారానీరు రాకున్నా ప్రత్యామ్నాయ మార్గంలో మంచినీటి సరఫరా అయ్యే విధంగా ప్రణాళికలు ఉండాలనిఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్,అదనపు కలెక్టర్ రెవెన్యూ యం.నగేష్,జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి,సివిల్ సప్లై అధికారి శ్రీనాథ్,మార్కెట్ అధికారి శ్వరణ్ సింగ్,ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పిఒలు,ఎపిఒలు,ఓపిఒల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి

### ● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**వనపర్తి టౌన్,మార్చి 26,ప్రభాతవార్త:** పార్లమెంటు ఎన్నికల నిర్వహణకు పి.ఒ,ఎ.పి.ఒ ల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ తెలిపారు.మంగళవారం కలెక్టరేట్ లోని ఎన్.ఐ.సి.హాల్లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంచిత్ గంగ్వార్,అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం నగేష్,సంబంధిత అధికారులతో కలిసి పోలింగ్ సిబ్బంది పి.ఒ లు,ఎ.పి. ఒ లు,ఓ.పి.ఒ.ల,మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలో 556 పోలింగ్ కేంద్రాలు (ఆగ్జిలరీ పోలింగ్ స్టేషన్లతో కలిపి) ఉన్నాయని చెప్పారు.జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా పకడ్బందీగా నిర్వహించేందుకు ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ అధికారి,ఒక సహాయ ప్రిసైడింగ్ అధికారితో పాటు ఇద్దరు ఓపిఓలను కేటాయించామన్నారు.ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం 45 శాతం అదనపు సిబ్బందితో కలుపుకొని 745 మంది ప్రిసైడింగ్ అధికారులు,786 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 1702మంది ఒ.పి.ఒలను ఎన్నికల నిర్వహణకు ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బంది కేటాయింపు జరిగినట్లు తెలిపారు.వీరితో పాటు ఎన్నికలు పారదర్శంగా నిర్వహించేందుకు 148 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించడం జరిగింది.పోలింగ్ సిబ్బందికి ఏప్రిల్ 1 నుండి 4 వరకు శిక్షణ కార్యక్రమం పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంచిత్ గంగ్వార్,అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం నగేష్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




ఎన్నికల నిర్వహణకు ర్యాండమైజేషన్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి**

**వానాకాలం పంట సీఎంఆర్ రారైస్ డెలివరీపై**

**కలెక్టర్‌లు ప్రత్యేక దృష్టి సారించాలి**

**తాగునీటి ఇబ్బందులు రానీయొద్దు**

**ధాన్యం కొనుగోలు, తాగునీటి సరఫరాపై జిల్లా కలెక్టర్‌లతో విడియో కాన్ఫరెన్స్**



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ జి. రవినాయక్, జిల్లా అధికారులు

**మహబూబ్‌నగర్ బ్యూరో,మార్చి 26 ప్రభాతవార్త :** యాసంగి 2023,24 ధాన్యం వరికోతలననుసరించి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్‌లను, అదనపు కలెక్టర్‌లను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హైదరాబాద్‌లోని డా.బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి ధాన్యం కొనుగోలు, వేసవిలో త్రాగునీటి సరఫరా ప్రణాళికపై జిల్లా కలెక్టర్‌లతో విడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ జి. రవి నాయక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావులతో కలిసి ఈ విడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ, యాసంగి పంట కోతలకు వస్తున్న నేపథ్యంలో జిల్లా స్థాయిలో వరికోతల ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరిస్తూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉంటుందని సూచించారు.రాష్ట్ర వ్యాప్తంగా7149 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉంటుందని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసంమైన మౌలిక వసతులు కల్పించాలని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచు కుని త్రాగునీటి సరఫరా, టెంట్లు వంటి ఏర్పాట్లు చేయాలని సిఎస్ అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ప్యాడి క్లీనర్లు, తేమ యంత్రాలు, వెయింగ్ యంత్రాలు, టార్పాలిన్లు, గన్ని బ్యాగులు సన్నద్ధం చేసుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంఛార్జిలు, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో రైస్ మిల్లులకు రవాణా చేసేందుకు అవసరమైన వాహనాలు సిద్ధం చేసుకోవాలని అన్నారు.చివరి గింజ వరకు నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరపై ప్రభుత్వంప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. వానాకాలం 2023, 24కు సంబంధించి సిఎంఆర్ రారైస్ డెలివరీ వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని, భారత ఆహార సంస్థ నిర్దేశించిన సమయానికి రైస్ డెలివరీ చేసే విధంగా ప్రతి జిల్లాలో రైస్‌మిల్లుల పనితీరును ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని, ప్రతిరోజు రైస్ మిల్లులు పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిచేలా చూడాలని, సిఎంఆర్ రారైస్ డెలివరీపై కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుందని సిఎస్ పేర్కొన్నారు.

**వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి:** వేసవికాలంలో త్రాగునీటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ త్రాగునీటి సరఫరాలో వచ్చే చిన్న చిన్నసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రతిగ్రామం, మున్సిపల్ వార్డు స్థాయిలో త్రాగునీటి సరఫరాకు సూక్ష్మ ప్రణాళికలు రూపొందించడం జరిగిందని, త్రాగునీటి పైప్‌లైన్ లీకేజీలు అరికట్టాలని తెలిపారు. జిల్లాలో త్రాగునీటి అవసరాల మేరకు ఇప్పటికే మొదలుపెట్టిన రిపేర్‌లు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ పరిధిలో ఉన్న త్రాగునీటి వ్యవస్థను ఒకసారి పరిశీలించి అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని తెలిపారు. త్రాగునీటి సరఫరాలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేసేందుకు సన్నద్ధం కావాలని ప్లాన్ బీ తయారు చేసుకోవాలని అన్నారు. ప్రతి మున్సిపాలిటీలో చివరి వార్డు, గ్రామాలలో చివరి ప్రాంతం వరకు త్రాగునీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుంచి దశల వారిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు ప్రణాళిక తయారు చేసుకున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మేర ప్యాడి క్లీనర్లు వేయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు, ఇతర సామాగ్రి సన్నద్ధం చేస్తున్నామని, వేసవి దృష్ట్యా అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని, ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల ప్రవర్తనా నియమావళి కట్టుదిట్టంగా అమలయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఖరీఫ్ 2023,24 సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ రా రైస్ డెలివరీ సకాలంలో పూర్తి చేసేవిధంగా రైస్ మిల్లులను పర్యవేక్షిస్తామని అన్నారు. జిల్లాలో ఉన్న రైస్‌మిల్లులు పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిచి ప్రతిరోజు నిర్దేశించుకున్న లక్ష్యాల మేరకు భారత ఆహార సంస్థకు రా రైస్ డెలివరీ సరఫరా చేస్తామని అన్నారు. సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ రవినాయక్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేయబోయే ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం దిగుబడి ప్రకారం అవసరమైన మేర ప్యాడి క్లీనర్లు, డిజిటల్ కాంటాలు, టార్పాలిన్లు ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో డిఎస్ఓ శ్రీనివాస్, పౌర సరఫరా డిఎం ప్రవీణ్, డిసిఓ పద్మ, డిఆర్‌డిఓ నర్సింహులు, డిపిఓ యాదయ్య, మిషన్ ఇంట్రా ఈఈ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

**బాలానగర్,మార్చి 26 ప్రభాతవార్త:** ఉపాధి హామీ పథకం పనులపై ప్రతి ఏడాది మార్చి నెలలో జరిగే సోషల్ ఆడిట్‌ను బాలానగర్ మండలంలో నిర్వహించారు. మంగళవారం ఈ మేరకు మండల ఎంపిడిఓ కార్యాలయం సమావేశ మందిరంలో అందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. 2022,23 సంవత్సరానికి మూడు కోట్ల 609 లక్షల పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఆయా గ్రామాలలో క్షేత్రస్థాయిలో పరిశీలించి కూలీలను కలుసుకుని వాస్తవాలు తెలుసుకునే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు పలు విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం జరిగిందని అందుకు రూ. 16,100లను జరిమానా విధించడంజరిగిందని తెలిపారు.కార్యక్రమానికి ఎంపిడిఓ శరత్ చంద్ర బాబు, అడిషనల్ డిఆర్‌డిఓ ముషైదా, ఎపిడి శ్రీపాదరావు, విజిలెన్స్ ఆఫీసర్ ప్రేమలత, ఏవిఓ శృతి, అంబుడ్స్ మెన్ సంతోష్, ఎంపిఓ, ఎపిఓరాజెఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఎన్ఆర్‌ఈజిఎస్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## పూలే అంబేద్కర్ 4వ జాతర కరపత్రం విడుదల

**బాలానగర్,మార్చి 26 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా బాలనగర్ మండలంలో పూలె అంబేద్కర్ 4వ జాతర ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సిరిసనోల్ల బాలరాజు మాదిగ మాట్లాడుతూ వచ్చే ఏప్రిల్ నెల 27న అంబేద్కర్ కళాభవన్‌లో పూలె అంబేద్కర్ 4వ జాతర పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందన్నారు. జాతరకు సంబంధించిన కరపత్రాలు విడుదల జాతరకు ప్రొ॥ జానపద కళాకారులు మేధావులు వివిధ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు పాల్గొంటారని, పూలె అంబేద్కర్ జీవిత చరిత్ర వారు చేసిన సేవలను వివరిస్తూ రాత్రంతా ఆట మాటతోజాతర కొనసాగుతుందన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలోని అన్ని మండలాల బహుజనులు,వివిధ సంఘాల నాయకులు పూలే అంబేద్కర్ జాతరకార్యకర్తలు జాతరకు వచ్చి విజయవంతంచేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పూలె అంబేద్కర్ 4వ జాతర జిల్లా ఉపాధ్యక్షులు ఆరేళ్ల యాదయ్య, టిఎంఆర్పిఎస్ నాయకులు ఉడిత్యాల వెంకటయ్య, ఎం. చంద్రయ్య,కళ్లెం మల్లేష్,బి.చంద్రయ్య,నర్సింలు, రాములు పాల్గొన్నారు.

